

15 నెలల తర్వాత వీడిన మిస్టరీ

గుర్తు తెలియని వ్యక్తి మృతి మిస్టరీ 15 నెలల తర్వాత వీడింది. భార్య తన ప్రియుడు, కుమారుడి సాయంతో భర్తను కడతేర్చింది.

8లో



టమాట కిలో రూ.23

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
33.8°/18.2°

జిల్లా పరిధిలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. తూర్పు దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక



ప్రశాంతి నిలయం/ పుట్టపర్తి టౌన్: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా తెలియజేయాలని సూచించారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీలు స్వీకరించనున్నట్లు ఎస్పీ రత్న మరొక ప్రకటనలో తెలిపారు.

ముగిసిన సత్యసాయి గ్లోబల్ అఖండ భజన



సాయికుల్వంత్ సభా మందిరంలో భజన గీతాలు ఆలపిస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: విశ్వశాంతిని కాంక్షిస్తూ చేపట్టిన సత్యసాయి గ్లోబల్ అఖండ భజన ఆదివారం సాయంత్రం ముగిసింది. 24 గంటల పాటు ప్రపంచ నలుమూలలా ఉన్న సత్యసాయి సేవా సంస్థలు ఉమ్మడిగా చేపట్టిన అఖండ భజన కార్యక్రమంలో లక్షలాది మంది సత్యసాయి భక్తులు పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా ప్రశాంతి నిలయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు చక్కటి భక్తిగీతాలతో భజన కొనసాగించారు. భక్తులకు అన్న ప్రసాదాల వితరణ చేశారు.

బాలుడు జలసమాధి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం చెరువు మరువ వద్ద అపశ్రుతి చోటు చేసుకుంది. మొదటి మరువ వద్ద ఓ బాలుడు కాలుజారి పడటంతో జలసమాధి అయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కాగితాలవీధికి చెందిన కూల్‌డ్రింక్స్ వ్యాపారి ఫయాజ్, యాస్మిన్ దంపతుల కుమారుడు లుక్మాన్ (14) ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి మొదటి మరువ వద్ద నడుచుకుంటూ వెళుతుండగా కాలుజారి చెరువులో పడిపోయాడు. స్నేహితులు గమనించి చెరువులో వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, టూటౌన్ సీఐ రెడ్డప్ప, ఫైర్ ఆఫీసర్ రాజు మరువ వద్దకు చేరుకుని ఈతగాళ్లతో వెతికించారు. రాత్రి ఏడు గంటల నుంచి దాదాపు రెండు గంటలు శ్రమించి లుక్మాన్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

అమరనాథ్‌రెడ్డిపై మరో కేసు



అమరనాథ్‌రెడ్డికి నోటీసులు ఇచ్చేందుకు వచ్చిన అవనిగడ్డ ఎస్‌ఐ శ్రీనివాస్

కదిరి అర్బన్: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ మలక అమరనాథ్‌రెడ్డిపై కేసుల పరంపర కొనసాగుతోంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్టుపై ఈ నెల రెండో తేదీన కదిరి రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో అరెస్టయ్యి ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యాడు. అవనిగడ్డలో మరొక ఎఫ్‌ఐఆర్ నమోదైందని, నోటీసులు ఇచ్చేందుకు ఆదివారం రాత్రి అవనిగడ్డ ఎస్‌ఐ శ్రీనివాస్ వీరచిన్నయ్యగారిపల్లిలోని అమరనాథ్ ఇంటికి తన సిబ్బందితో వెళ్లారు. వారం రోజులుగా పోలీసులు గ్రామంలో ఇలా అమరనాథ్‌రెడ్డి ఇంటికి వచ్చి సోదాలు చేయడం, నోటీసులు జారీ చేయడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

వేరు'శని'గ



సంప్రదాయ పంట వేరుశనగకు ధరాఘాతం తగిలింది. ధరలు దారుణంగా పతనమయ్యాయి. పెట్టుబడులు సైతం తిరిగి రాక రైతులు కుదేలవుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల ప్రభావం పంట దిగుబడి, నాణ్యతపై చూపింది. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు పాలకులను కోరుతున్నారు.



వేరుశనగ కాయలను యంత్రంతో వేరు చేస్తున్న రైతులు

- గిట్టుబాటు ధరలేక విలవిల
- అమాంతం పడిపోయిన ధర
- ఆందోళన చెందుతున్న రైతులు

బత్తలపల్లి: ఎన్నో ఆశలతో సాగు చేసిన వేరుశనగ ఈసారి నిరాశే మిగిల్చింది. ఏ యేటికాయేడు పంట సాగు చేయడం ప్రకృతి వైపరీత్యాలతో నష్టాలుపాలు కావడం సర్వసాధారణమైపోతోంది. ఈసారైనా పంట చేతికందకపోతుందా.. కష్టాల నుంచి గట్టెక్కలేకపోతామా అన్న ఆశతో రైతులు వ్యవసాయం చేస్తూనే ఉన్నారు. జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 1,74,910 ఎకరాలు. అయితే ఈ ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా 77,662 ఎకరాల్లో మాత్రమే పంట సాగైంది. ముంగారు సమయంలో మురిపించిన వరుణుడు మధ్యలో ఎగదీసి.. పంట ఇంటికి చేర్చే సమయంలో అధిక వర్షాలతో కుళ్లబెట్టి నట్టేట ముంచాడు.

పతనమవుతున్న ధరలు

ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంటకు ధరలు లేక రైతులు అల్లాడిపోతున్నారు. ఎకరాకు దుక్కి, ఎరువులు, కలుపు, చీడపీడల నివారణకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ఖర్చు చేశారు. వర్షాధారం కింద ఎకరాకు 5 నుంచి 7 బస్తాల వరకు పంట దిగుబడి వస్తోంది. అయితే మార్కెట్‌లో ఒక్కసారిగా ధర పడిపోయింది. 46 కిలోల బస్తా రూ.2,200 ధరతో వ్యాపారులు కొంటున్నారు. అవుటన్ బాగా ఉంటే రూ.2,600 వరకు ధర పలుకుతోంది. ఇది ఏమాత్రమూ గిట్టుబాటు కావడం లేదు. పంట పెట్టుబడుల కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు దిగులు చెందుతున్నారు. కనీసం పశువులకు మేత మిగులుతుంది అనుకుందామంటే కాయలు తీసేందుకు కూలీల ఖర్చులు భరించలేని స్థాయికి చేరాయి. యంత్రాలతో ఆడించడం వల్ల మేతకు కూడా పనికి రాకుండా పోతోంది. మరోవైపు తుపాను కారణంగా వర్షాలకు పంటలు తడిసి గ్రాసానికి ఏమాత్రమూ ఉపయోగపడడం లేదు.

ప్రభుత్వం ఇలా...రైతులైతే ఇలా...

ఈ ఏడాది ఖరీఫ్‌లో ప్రభుత్వం 40 శాతం రాయితీతో రైతులకు 30 కిలోల వేరుశనగ కాయల బస్తా ధర రూ.1,710గా నిర్ణయించింది. వాటిని రైతు సేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని పొందారు. అదే రైతులు పండించిన పంటను అమ్ముతుంటే మాత్రం 46 కిలోల బస్తా రూ.2,200తో కొనుగోలు చేస్తున్నారు. అది కూడా దళారుల ద్వారానే అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది.

వర్షంతోనే నష్టపోతున్నాం



వేరుశనగ పంట సాగు చేసిన తర్వాత వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో మొదటి విడతలో సాగు చేసిన వారంతా నష్టపోయాం. నేను రెండు ఎకరాల్లో సాగు చేశాను. సుమారు రూ.60 వేల దాకా ఖర్చు వచ్చింది. కాయలు గట్టిపడే సమయంలో అతివృష్టి కారణంగా నాణ్యత లోపించింది. ఇప్పుడు వ్యాపారులు కొనేందుకు ముందుకు రావడంలేదు. దిక్కు తోచడం లేదు. దళారుల సాయంతో పంటను అమ్ముకునే పరిస్థితి నెలకొంది.

–పెద్ద తాతయ్య, రైతు, గంటాపురం, బత్తలపల్లి మండలం

పెట్టుబడి ఖర్చులూ రావు



ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి రైతులను ఆదుకుంటాయని ఆశించాం. అతివృష్టి, అనావృష్టి కారణంగా ఈ ఏడాది రైతులకు నష్టమే జరిగింది. సుమారు రూ.80 వేలు ఖర్చు చేసి నాలుగు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. పండిన పంటకు గిట్టుబాటు ధరలేదు. ఇప్పుడున్న ధరకు అమ్మితే పెట్టుబడి ఖర్చు కూడా అందే పరిస్థితి లేదు. వర్షాలకు తడిసిపోవడంతో పశుగ్రాసానికి పనికి రాకుండా పోయింది.

–కొంకా గాంధీ, రైతు, బత్తలపల్లి

గిట్టుబాటు ధర కల్పించాలి



ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఏటా నష్టపోతూనే ఉన్నాం. 46 కిలోల బస్తా రూ.3,500 చొప్పున గిట్టుబాటు ధర నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. వ్యాపారులు, దళారులు రంగప్రవేశం చేసి రైతులను మోసం చేసే ప్రమాదం ఉన్నందున మార్కెటింగ్ సౌకర్యం కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. జిల్లాలోని అన్ని మండలాలనూ కరువు జాబితాలో చేర్చి రైతులను ఆదుకోవాలి.

–ప్రభాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నేత, బత్తలపల్లి

ఎలుగుబంటి హల్‌చల్



చికిత్స పొందుతున్న రైతు నాగరాజు

రొళ్ల: రత్నగిరి పంచాయతీ పరిధిలోని బాజయ్యపాళ్యం - కురబరహట్టి గ్రామంలో ఆదివారం సాయంత్రం ఎలుగుబంటి హల్‌చల్ చేసేసింది. కొండప్రాంతం నుంచి ఆహారం కోసం గ్రామంలోకి వచ్చిన ఎలుగుబంటిని చూసి ప్రజలు భయాందోళనతో పరుగులు తీశారు. ఈ క్రమంలో ఒంటరిగా దొరికిన నాగరాజు అనే రైతుపై ఎలుగుబంటి దాడి చేసి గాయపరిచింది. ప్రజలు గమనించి పెద్దగా శబ్దం చేయడంతో ఎలుగుబంటి సమీపంలోని ముళ్ల పొదల్లోంచి వక్కతోటలోకి వెళ్లి దాక్కుంది. ఎలుగుబంటి గ్రామంలోకి చొరబడడం ఇదే తొలిసారని ప్రజలు చెబుతున్నారు. గాయపడిన రైతు నాగరాజును కుటుంబ సభ్యులు రొళ్ల సీహెచ్‌సీకి తరలించారు. ప్రాణాపాయం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. అటవీ అధికారులు స్పందించి వన్యప్రాణులను రక్షించి, తిరిగి అడవిలో వదిలేయాలని కోరుతున్నారు.

ఎంపీఈఓల సంఘం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు

పుట్టపర్తి: ఎంపీఈఓల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం పుట్టపర్తిలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రవికుమార్, ఉపాధ్యక్షులుగా చెన్నానాయక్ నాగార్జున, జనరల్ సెక్రటరీగా మోహన్, జాయింట్ సెక్రటరీలుగా సోమశేఖర్, శివలీల, ట్రెజరర్లుగా రామమోహన్‌రెడ్డి, ప్రవల్లిక, రెహనాను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పేరూరు డ్యాంలోకి నీరు



పేరూరు డ్యాం వైపు పరుగులు పెడుతున్న వర్షపు నీరు

రామగిరి: అప్పర్ పెన్నార్ ప్రాజెక్ట్ (పేరూరు డ్యాం)లోకి వర్షపునీరు చేరుతోంది. వారం కిందట కర్ణాటకలోని జయమంగళి నది పూర్తిస్థాయిలో నిండి పరవళ్లు తొక్కగా, పరిగి చెరువు మరువపారింది. అక్కడి నుంచి రొద్దం చెరువు మీదుగా నాగలమడక చెక్‌డ్యాం పూర్తిగా నిండి నీరు పేరూరు డ్యాం వైపు పరుగులు పెడుతోంది. నాలుగురోజులుగా నాగలమడక చెక్‌డ్యాం నుంచి పెన్నానది వెంబడి వస్తున్న నీరు శనివారం రాత్రి పేరూరు డ్యాంలోకి చేరినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఫిరాయింపులు సరే.. పదవులేవీ?

పదవులు ఆఫర్ చేయడం.. పార్టీ ఫిరాయించాక మోసం చేయడం టీడీపీ నేతలకు వెన్నతో పెట్టిన విద్య. నాటి నుంచి ఫిరాయింపు రాజకీయాలను అనవాయితీగా కొనసాగిస్తోంది. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు గెలిచిన దాఖలాలు కూడా లేదు. ప్రతి చోటా వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పంచాయతీ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పెత్తనం చెలాయించాలనే ఉద్దేశంతో ప్రజాక్షేత్రంలో గెలిచిన నాయకులకు 'తమ్ముళ్లు' గాలం వేసి లాగారు. పార్టీ ఫిరాయించి నెలలు గడిచినా.. ఇప్పటి వరకు ఎలాంటి పదవులూ ఇవ్వకుండా జాప్యం చేస్తుండటంతో వారి రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

- ప్రత్యర్థి పార్టీ నేతలకు టీడీపీ గాలం
- చైర్మన్ పదవులు ఆఫర్ చూపుతున్న వైనం
- పార్టీ ఫిరాయించిన తర్వాత పంగనామాలు



సాక్షి, పుట్టపర్తి: పార్టీ ఫిరాయించి టీడీపీలోకి వెళ్లిన వారికి ఆరంభం నుంచి కష్టాలు ఎదురవుతున్నాయి. పలు ఆఫర్లు ప్రకటించి కండువా వేశారు. అయితే ఆ తర్వాత పట్టించుకోవడం లేదని బంధువుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ ఉండలేని.. వెనక్కి రాలేని పరిస్థితి నెలకొంది. వెన్నుపోటుకు కేరాఫ్‌గా నిలిచిన టీడీపీ నాయకులు ప్రలోభాలకు గురి చేసి పార్టీలోకి చేర్చుకుని.. మోసం చేశారని వాపోతున్నారు. మరోవైపు గెలిపించినా ప్రజల్లోకి వెళ్లలేని పరిస్థితి. పార్టీ ఫిరాయించిన ప్రజాప్రతినిధుల ఇళ్ల ముట్టడి కార్యక్రమం కూడా త్వరలోనే ఉందని సమాచారం. నైతిక బాధ్యతగా పదవికి రాజీనామా చేసి.. వెళ్లాలని ఓటర్లు డిమాండ్ చేస్తున్నారు.

ఖరారు కాని 'పురం' పీఠం

హిందూపురం మున్సిపల్ పరిధిలో 38 వార్డులకు గాను వైఎస్సార్‌సీపీ 32 చోట్ల విజయం సాధించింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక చైర్‌పర్సన్‌తో సహా కొందరు కౌన్సిలర్లను టీడీపీలో చేర్చుకున్నారు. అయితే చైర్మన్ స్థానం భర్తీకి నెలలు గడుస్తున్నా ఎన్నిక నిర్వహించకపోవడం దారుణం. ఎన్నికకు నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో 'పురం' పీఠం ఎవరిని వరిస్తుందో అర్థం కాని పరిస్థితి. ఒకవేళ ఎన్నిక జరిగితే వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడం ఖాయమనే చెబుతున్నారు.

గతంలో ఎమ్మెల్యేలకూ టోకరా..

నారా చంద్రబాబునాయుడు గతంలో కూడా 23 మంది ఎమ్మెల్యేలను టీడీపీలో చేర్చుకుని.. అందులో ఒకరిద్దరు మినహా ఆ తర్వాత ఎన్నికల్లో టికెట్ కూడా ఇవ్వలేదు. ఇందులో కొందరు వెనక్కు రాగా, ఇంకొందరు ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. సీనియారిటీ ఉన్నా మంత్రి పదవి లేకుండా పోయింది. ప్రస్తుతం అదే తరహాలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు చుక్కెదురవుతోంది. నామినేటెడ్ పోస్టులు ఆశచూపి నిలువునా మోసం చేయడం ఖాయమని చెబుతున్నారు.

రాజకీయ భవిష్యత్తు లేనట్లే

పార్టీ ఫిరాయించిన వారి రాజకీయ భవిష్యత్తు అంధకారమే. క్రమశిక్షణ ఉల్లంఘించిన వారిపై వేటు తప్పదు. ఒక చోట గెలిచి.. మరో పార్టీలో చేరడం నాయకత్వ లక్షణం కాదు. సంతలో పశువుల్లా కొనడం టీడీపీకి అలవాటే. పార్టీ ఫిరాయించిన వాళ్లు రాజకీయంగా ఎదిగినట్లు చరిత్రలో లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల సమీకరణల్లో భాగంగా సామాన్యులకు పదవులు కట్టబెడితే.. నేడు డబ్బులకు అమ్ముడుపోయి వారు దిగజారుడు తనాన్ని నిరూపించుకున్నారు.

– ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు

తప్పుడు కేసులకు మూల్యం తప్పదు

- సోషల్ మీడియా పోస్టులపై 'పచ్చ'పాతం తగదు
- ఏకపక్షంగా కేసుల నమోదు చేయడం సరికాదు
- పోలీసులకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హెచ్చరిక

కదిరి: పాలన లోటుపాట్ల గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులపై పోలీసులు తప్పుడు కేసులు పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ధ్వజమెత్తారు. టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి ఏకపక్షంగా కేసులు నమోదు చేస్తున్న పోలీసులు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఆదివారం ఆమె కదిరి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గతంలో తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఎంతోమంది నాయకులపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో ఎన్నో అసభ్యకర, అభ్యంతరకర పోస్టులు పెట్టినపుడు పోలీసు ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఒకొక్కరికి ఒక్కో న్యాయమా అంటూ మండిపడ్డారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

బాబు పాలన అట్టర్ ఫ్లాప్

రాష్ట్రంలో చంద్రబాబు పాలన అట్టర్‌ఫ్లాప్ అయ్యిందని ఉషశ్రీ చరణ్ విమర్శించారు. ఎన్నికల హామీలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు దిగారని విరుచుకుపడ్డారు. ఖరీఫ్ పోయి రబీ సీజన్ వచ్చినా ఇంతవరకు రైతులకు పెట్టుబడి సాయం అందించిన దాఖలాలు లేవన్నారు. తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికీ రూ.15 వేల చొప్పున ఇవ్వాల్సిన నగదును సైతం జమ చేయలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా చిన్నారులు, మహిళలపై లైంగిక దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. హోం మంత్రి అనిత ఎస్సీ మహిళ కావడంతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆమెపై నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారన్నారు.

కబ్జాలపై కందికుంట మాట్లాడటమా?

కదిరి నియోజకవర్గంలో కబ్జా అనగానే ప్రజలకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేరు గుర్తొస్తుందని, అలాంటి వ్యక్తి ఇప్పుడు కబ్జాలపై మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఉషశ్రీ చరణ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. క్రిస్టియన్ బోర్డింగ్ స్కూల్‌ను కబ్జా చేసి, కూల్చేసిన ఘనుడు కందికుంట అనే విషయం జిల్లా మొత్తం తెలుసన్నారు. ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లే దారిలో పేద ముస్లింలకు చెందిన 3 ఎకరాల స్థలం కబ్జా చేసి చుట్టూ కంచె వేసింది నువ్వు కాదా? అని కందికుంటపై ధ్వజమెత్తారు. కుటాగుళ్ల వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రణీత్‌రెడ్డిపై అక్రమ కేసు పెట్టి, ఆయన క్వారీని మూసివేయించి, రూ.12 కోట్లు జరిమానా వేయించానని కందికుంట శునకానందం పొందుతున్నారన్నారు. అధికారం ఉంది కదా అని వైఎస్సార్‌సీపీ వారిపై అక్రమ కేసులు పెట్టిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కదిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కందికుంట ప్రోద్బలంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు అమాయకులపై పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బి.ఎస్.మక్బూల్ అహ్మద్ ధ్వజమెత్తారు. ఒక రిజిస్ట్రేషన్ విషయంలో సాక్షి సంతకం పెట్టిన తనపై కూడా కేసు నమోదు చేయడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. కదిరిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం మూత పడిందని, సమన్వయకర్త పారిపోయాడని కొన్ని పచ్చ చానళ్లు, పత్రికలు తప్పుడు ప్రసారాలు చేశాయని మండిపడ్డారు. తాను ఇక్కడే పుట్టి పెరిగానని, ఊపిరి ఉన్నంత వరకూ నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. పార్టీ కార్యాలయం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకూ తెరిచే ఉంటుందని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని స్పష్టం చేశారు. జమిలీ ఎన్నికలు వస్తే వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, మాజీ సమన్వయకర్త ఇస్మాయిల్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





కదిరిలో కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, హాజరైన నాయకులు, కార్యకర్తలు

సోషల్ మీడియా కార్యకర్తలకు పరామర్శ





ఆంజనేయులు, అమరనాథరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

కదిరి అర్బన్/ నల్లచెరువు: ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టినందుకు అరెస్టయ్యి ఇటీవల బెయిలుపై విడుదలైన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ మలక అమరనాథ్‌రెడ్డిని ఆదివారం వీరచిన్నయ్యగారిపల్లిలో ఉషశ్రీ చరణ్, సమన్వయకర్త మక్బూల్ అహ్మద్‌తో కలిసి పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని అమరనాథ్‌రెడ్డి తల్లిదండ్రులు గంగిరెడ్డి, ఈశ్వరమ్మకు భరోసా కల్పించారు. అలాగే నల్లచెరువు మండలం కె.పూలకుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త ఆంజనేయులు (అంజీ వాల్మీకి) కుటుంబ సభ్యులను సమన్వయకర్త మక్బూల్ అహ్మద్, సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి, లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లోకేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డితో కలిసి ఉషశ్రీచరణ్ పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి దశరథ నాయుడు, రైతు విభాగం కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బోధనకు పరిమితం చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

కదిరి అర్బన్: ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఆ సంఘం జిల్లా స్వర్ణోత్సవ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని సరిదిద్ది యాప్‌లు, ఆన్‌లైన్ పనుల భారాన్ని తగ్గించాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు కావస్తున్నా ఇంత వరకు ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించలేదన్నారు. అసలు పీఆర్సీ ఊసే లేకుండా ఉద్యోగులను ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రూ.20 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జయచంద్రారెడ్డి, గౌరవాధ్యక్షుడిగా భూతన్న, సహాధ్యక్షుడిగా బాబు, సీతామహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కోశాధికారిగా శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులుగా తాహిర్‌వలీ, రమీజాబీ, శివశంకర్, లక్ష్మీనారాయణ, నరేష్‌కుమార్, సుబ్బారెడ్డి, అనిల్‌కుమార్, లతాదేవితో పాటు మరికొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఆలయ హుండీ ధ్వంసం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డులో వెలసిన కాలభైరవస్వామి గుడి వద్ద శనివారం అర్ధరాత్రి దొంగలు హుండీని ధ్వంసం చేశారు. హుండీలోని డబ్బును దొంగతనం చేయాలని ప్రయత్నించారు. హుండీ తెరుచుకోకపోవడంతో అక్కడి నుంచి పరారయ్యారు. ఆదివారం ఉదయం గుడికి వచ్చిన భక్తులు గమనించి టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కోడిపందేలు ఆడుతున్న ఆరుగురి అరెస్టు

బత్తలపల్లి: కోడి పందేలు ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.5,670 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మండలంలోని ఈదుల ముష్టూరు శివారులో ఆదివారం కోడి పందేలు ఆడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. సిబ్బందితో దాడులు చేయగా.. కోడి పందేలు ఆడుతున్న ఆరుగురితో పాటు వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రెండు కత్తులు, ఫిస్, రూ.5,670 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు, కానిస్టేబుల్ రామలింగ, నారాయణస్వామి, మురళి, గోపాల్, బాలకృష్ణ, హోంగార్డు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఒక గ్రామం.. రెండు జిల్లాలు!



ఇక్కడ కనిపిస్తున్న ఈ ఇల్లు సూర్యనారాయణకు చెందినది. ఇంటి లోపలి భాగం నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం రంగాపురానికి చెందినది కాగా ఇంటి బయట ఉన్న బాత్రూమ్ మాత్రం అనంతపురం జిల్లా యాడికి మండలం దైవాలమడుగు గ్రామంలోకి వస్తోంది.

ఆ గ్రామం.. చూసేందుకు ఒక్కటే అనిపిస్తుంది. కానీ రెండు పంచాయతీలు. రెండు మండలాలు.. ఆఖరికి జిల్లాలు కూడా వేర్వేరే. తక్కువ జనాభా ఉన్నా రెండు రేషన్ దుకాణాలు, అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. ఏ ఎన్నికలు వచ్చినా ఎవరి నియోజకవర్గాల్లో వారు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.



రెండు జిల్లాలను కలుపుతున్న రాయలచెరువు - డోన్ రోడ్డు

- రోడ్డుకు ఒక వైపు అనంతపురం.. మరోవైపు నంద్యాల జిల్లా
- అంగన్‌వాడీ మొదలు రేషన్ షాపు దాకా అన్నీ రెండే
- ఓటు వేసేది కూడా వేర్వేరు నియోజకవర్గాల్లోనే..
- సమస్యలున్నా పట్టించుకోవడంలేదని స్థానికుల ఆవేదన

సమ్‌థింగ్ Special

యాడికి: అనంతపురం జిల్లాకు చివరి గ్రామమైన దైవాలమడుగులో వింత పరిస్థితి నెలకొంది. గ్రామంలో 160 కుటుంబాలు ఉన్నాయి. 408 ఓట్లు ఉన్నాయి. రాయలచెరువు - డోన్ రహదారిలోని బ్రహ్మంగుడి కాలనీలో 30 కుటుంబాలలో 20 కుటుంబాలు నివసిస్తున్న భాగం అనంతపురం జిల్లా యాడికి మండలం సి.లక్షుంపల్లె గ్రామ పంచాయతీలోకి వస్తోంది. అలాగే మరో 10 కుటుంబాలు ఉన్న భాగం నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం జక్కసానికుంట్ల పంచాయతీ పరిధిలో ఉంది. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆ 30 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను అప్పటి ఉమ్మడి కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం జక్కసానికుంట్ల పంచాయతీ నుంచి మంజూరు చేసి నిర్మించారు. 2009 ఎన్నికలకు ముందు నియోజకవర్గాల పునర్విభజన సమయంలో కూడా ఈ గ్రామాన్ని యథాతథంగా కొనసాగించడం గమనార్హం.

ప్రధాన రహదారే సరిహద్దు ..

దైవాలమడుగు గ్రామంలో ప్రధాన రహదారి రెండు జిల్లాల సరిహద్దు రేఖగా మారింది. రోడ్డుకు ఒకవైపు ఉన్న భూభాగం అనంతపురం జిల్లాలోకి, మరోవైపు ఉన్న భాగం నంద్యాల జిల్లా పరిధిలో ఉన్నట్లు పరిగణిస్తూ గత పాలకులు నిర్ణయించారు. ఈ గ్రామంలో ఏవైనా సరే రెండు చొప్పున ఏర్పాటు చేయాల్సిందే. రేషన్ దుకాణాలు రెండు, అంగన్వాడీ కేంద్రాలు రెండు ఉండటం విశేషం. రంగాపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాల లేక పోవడంతో ఆ గ్రామం నుంచి కొంత మంది తమ పిల్లలను దైవాలమడుగులోని ప్రాథమిక పాఠశాలకు పంపుతున్నారు. అధికారులు, కొత్త వ్యక్తులు తికమక పడకుండా ఉండేందుకు కర్నూలు జిల్లా పరిధిలో ఉన్న భాగాన్ని బ్రహ్మం గుడి కాలనీ అని పిలుస్తారు. అనంతపురం జిల్లా పరిధిలో దైవాలమడుగు గ్రామంలో 408 ఓట్లు ఉన్నాయి. రోడ్డు సమీపంలో 20 కుటుంబాలలోని 40 ఓట్లు అనంతపురం జిల్లాలో ఉన్నాయి. కానీ వీరు నివసిస్తున్న ఇంటికి ప్యాపిలి మండలం నుంచి కరెంటు ఉండటంతో కరెంటు బిల్లును ప్యాపిలి మండలం విద్యుత్ అధికారులకు చెల్లిస్తున్నారు. అవతలి వైపున ఉన్న 10 కుటుంబాలలో దాదాపు 30 మంది ఎన్నికల సమయంలో తమ ఓటు హక్కును నంద్యాల జిల్లాకు వినియోగించుకున్నారు. ప్రస్తుతం రోడ్డు సమీపంలో ఏదైనా ఉత్సవాలు జరిగినప్పుడు అందరూ కలిసే చేసుకుంటారు. ఇక్కడున్న వారందరికీ వ్యవసాయమే జీవనాధారం.

ఇళ్లు ఇక్కడ.. కరెంటు బిల్లు కట్టేది అక్కడ

ఎనిమిదేళ్ల క్రితం బ్రహ్మంగుడి సమీపంలో ఓ విద్యార్థిని ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బతుకు దెరువు కోసం బాలిక తల్లి దుబాయ్‌కి వెళ్లింది. ఆ బాలిక అన్న లారీడ్రైవర్ కావడంతో డ్యూటీకి వెళ్లాడు. రేషన్ కార్డు, ఓట్లన్నీ నంద్యాల జిల్లా రంగాపురం (బ్రహ్మంగుడి కాలనీకి 12 మీటర్ల దూరంలోని) గ్రామానికి చెందే విధంగా ఉన్నాయి. కానీ ఆ కుటుంబం నివసిస్తున్న ఇల్లు మాత్రం అనంతపురం రెవెన్యూ డివిజన్‌లోకి ఉండటంతో డోన్ నియోజకవర్గం జలదుర్గం ఎస్ఐ వచ్చి ఈ బాలిక నివసిస్తున్న ఇల్లు నంద్యాల జిల్లాలోని రెవెన్యూ పరిధిలోకి రాదని చెప్పి కేసు నమోదు చేయకుండా వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న అనంతపురం జిల్లా యాడికి మండలం అప్పటి ఎస్ఐ కత్తి శ్రీనివాసులు బాలిక మృతదేహాన్ని కిందికి దింపి కేసు నమోదు చేసుకొని దహన సంస్కారాలు చేయించారు. ఆనాటి నుంచి అక్కడ నివసిస్తున్న 20 కుటుంబాలకు చెందిన వారు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఓట్లన్నీ అనంతపురం జిల్లాకు మార్చుకున్నారు. వీరిలో ప్రస్తుతం 8 మందికి వృద్ధాప్య పింఛన్లు కూడా వస్తున్నాయి. కానీ వారు నివసిస్తున్న ఇంటికి మాత్రం నంద్యాల జిల్లా నుంచి వచ్చే స్తంభాల ద్వారా కరెంట్‌ను వినియోగిస్తుండటంతో కరెంట్ బిల్లు, ఇంటి పన్నును నంద్యాల జిల్లాకు కడుతున్నారు. గత ఎన్నికల సమయంలో ఓట్లను అనంతపురం జిల్లాకు మార్చుకోవడంతో బ్రహ్మం గుడి కాలనీలో ఉన్న నీటి ట్యాంకును కర్నూల్ జిల్లాలోని రంగాపురానికి తరలించారు. దీంతో 20 కుటుంబాలకు చెందిన వారు రూ.60 వేల సొంత ఖర్చులతో నీటి ట్యాంకును ఏర్పాటు చేసుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మా ఇల్లు నిర్మించినప్పటి నుంచి ప్యాపిలి మండలం నుంచి వచ్చే విద్యుత్‌ను వాడుతున్నాం. కరెంటు బిల్లు కూడా వారికే కడుతున్నాం. ప్రస్తుతం మా కాలనీలో చాలా మంది ఆధార్, రేషన్ కార్డులను అనంతపురం జిల్లాకు మార్చుకున్నాం. మేము కరెంట్ బిల్లు కడతామన్నా లక్షుంపల్లె గ్రామ పంచాయతీ అధికారులు రసీదులు ఇవ్వటం లేదు. మా ఇండ్లకు కొలతలు వేసి ఇంటి పన్ను కట్టించుకోవాలి, కొత్తగా కరెంట్‌ను మా ఇండ్లకు సప్లయ్ చేసి కరెంట్ బిల్లును కట్టించుకొని మాకు సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఉల్లిందల దస్తగిరి, బ్రహ్మంగుడి పూజారి

30 ఏళ్లుగా డీ పట్టా ఇవ్వలేదు



బ్రహ్మంగుడి సమీపంలో మా పూర్వీకుల కాలం నుంచి నివసిస్తున్నాము. 2004లో మాకు ప్యాపిలి మండలం నుంచి ఇందిరమ్మ ఇళ్లను అప్పటి అధికారులు నిర్మించడంతో ఆధార్, రేషన్‌కార్డు, ఓట్లు, ఇంటి, కరెంటు పన్నులు అన్నీ ప్యాపిలి మండలం రంగాపురం గ్రామం పేరున ఉన్నాయి. రంగాపురంలో ప్రాథమిక పాఠశాల లేకపోవడంతో యాడికి మండలం దైవాలమడుగు ప్రాథమిక పాఠశాలలో చదివిస్తున్నాను. కానీ చందన రెవెన్యూ పొలంలో మాకున్న 1.80 ఎకరాల పక్కనే ఉన్న 3 ఎకరాల ప్రభుత్వ భూమిని గత 30 ఏళ్లుగా సాగులో ఉన్నాను. గత ఏడాది జరిగిన భూ పంపిణీలో నేను నంద్యాల జిల్లా వాసిని అని యాడికి రెవెన్యూ అధికారులు నాకు డీ పట్టా ఇవ్వలేదు. ఈ విషయం ప్యాపిలి తహసీల్దార్‌ను అడిగితే మీరు సాగు చేసిన భూమి ప్యాపిలి మండలంలో లేదని చెప్పారు. ఏమి చేయాలో అర్థం కాలేదు.

– రంగనాథ్, బ్రహ్మంగుడి కాలనీ

అ'పూర్వ' సమ్మేళనం



ముదిగుబ్బ: ఒక చోట కలిసిన పూర్వ విద్యార్థులు



బత్తలపల్లి: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



బత్తలపల్లి: ఉపాధ్యాయులతో 2007 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

బత్తలపల్లి: మండల పరిధిలోని నల్లబోయనపల్లి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. ఆత్మీయంగా ఒకరి గురించి ఒకరు తెలుసుకుంటూ చిన్ననాటి మధురస్మృతులు గుర్తు చేసుకున్నారు. 2002–03లో పదో తరగతి బ్యాచ్ లో 70 మంది విద్యార్థినీ, విద్యార్థులు చదువుకోగా, వారిలో 55 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే 2006–07లో పదో తరగతి చదువుకున్న వారిలో 133 మందికి గాను 80 మంది హాజరయ్యారు. వారందరూ వేర్వేరుగా ఆదివారం ఉన్నత పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

ముదిగుబ్బ: ముదిగుబ్బ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో 1990–91 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకే చోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. 34 సంవత్సరాల తరువాత పూర్వ విద్యార్థులు కలిసి ఆనందంగా గడిపారు.

సామాజిక విలువలు పెంపొందించాలి



మాట్లాడుతున్న ప్రముఖ కవి సడ్లపల్లె చిదంబరరెడ్డి

హిందూపురం/హిందూపురం టౌన్: 'సాహితీ రచనలు సామాజిక విలువలు పెంపొందించేలా ఉండాలి. సమాజంలోని మూఢనమ్మకాలను పారదోలి చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత కూడా సాహితీవేత్తలపైనే ఉంది' అని పలువురు వక్తలు తెలియజేశారు. పట్టణంలో టీచర్స్ కాలనీలో ప్రముఖ రాయలసీమ మాండలిక కవి సత్తపల్లి చిదంబరరెడ్డి స్థాపించిన తపన సాహితీ వేదిక కార్యాలయంలో జిల్లా అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో సాహిత్య వేదిక ప్రోత్సాహక పురస్కారాల ప్రదానం జరిగింది. దేశవ్యాప్తంగా 2023–24 తెలుగులో వెలువడిన 100కు పైగా కథా సంపుటాలు పోటీలో పాల్గొన్నాయి. సాహితీవేత్తలు రెండు ఉత్తమ లక్షణాలున్న కథా సంపుటాలను ఎంపిక చేశారు. కర్నూలు చెందిన రచయిత మారుతి పౌరోహితం రచించిన ఊరిమర్లు, బెంగళూరుకు చెందిన రచయిత్రి ఝాన్సీపాపుదేశి రచించిన దేవుడమ్మ మరో 10 కథా సంపుటాలను పురస్కారానికి ఎంపిక చేశారు. విజేతలకు నగదుతో పాటు జ్ఞాపికలను అందించారు. అలాగే రాయలసీమలోని రచయితలను ప్రోత్సహించడానికి అనంతపురంకు చెందిన యాములపల్లి నర్సిరెడ్డి, హిందూపురం సిద్ధగిరి శ్రీనివాస్, కడప జిల్లా బద్వేలు వివేక్‌లకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రచయితలు తూమచర్ల రాజారాం, శాంతి నారాయణ, అరసం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, అంకె శ్రీనివాస్, శ్రీధర్, రాజశేఖర్‌రెడ్డి, ఏటిగడ్డ అశ్వత్ నారాయణ, అరసం జిల్లా కార్యదర్శి నానీల నాగేంద్ర, ఆడవాళ్ల శేషగిరి రాయుడు, వెంకట కొండారెడ్డి, జిరసం సత్యసాయి జిల్లా అధ్యక్షుడు జాబిలి చాంద్ బాషా, జిరసం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్షరమాలి సురేష్, నవలా రచయిత సొంటి జయప్రకాష్, అరసం సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, తిలక్, గంగాధర్, ఉదయ భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డి సాహితీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పరారీలో ఉన్న గంజాయి విక్రేత అరెస్ట్

కదిరి టౌన్: గంజాయి అక్రమ రవాణా వ్యవహారంలో పట్టణంలోని నానాదర్గా ఏరియాకు చెందిన పటాన్ ముజాహిద్ ఖాన్‌పై గత నెల 11న పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి పరారీలో ఉన్న పటాన్ ముజాహిద్ ఖాన్‌ను శనివారం సాయంత్రం కదిరి–పులివెందుల రోడ్డులో ఉన్న పాలిటెక్నిక్ కాలేజ్ సమీపంలో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ముద్దాయిని పుట్టపర్తి కోర్టు మేజిస్ట్రేట్ వద్ద హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించడంతో అనంతపురం సబ్ జైలుకు తరలించినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. పలు కేసుల్లో ముద్దాయిగా ఉండటంతో కదిరి పట్టణ పోలీస్‌స్టేషన్లో రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు సీఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

తనకల్లు: మండల పరిధిలోని కొక్కంటిక్రాస్ చంద్రబాబునాయుడు కాలనీలో అంజినప్ప (45) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాలమేరకు.. చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన అంజినప్ప గాజుల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే ఏం జరిగిందో తెలీదు కానీ భార్యతో గొడవ పడ్డాడు. మనస్థాపంతో అంజినప్ప ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అంజినప్పను చికిత్స నిమిత్తం తనకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అంజినప్ప మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్ రమేష్ మృతి

గుడిబండ: మండల పరిధిలోని కేజీఎన్ పల్లికి చెందిన టెక్నికల్ అసిస్టెంట్ రమేష్ (55) ఆదివారం మృతి చెందాడు. కళ్యాణదుర్గం నియోజకవర్గం శెట్టూరు మండలంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం ఇంట్లో పడుకోగా నిద్రలోనే చనిపోయాడన్నారు.మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప నాయకులతో కలిసి మృతుడి నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలను ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చెన్నేకొత్తపల్లిలో పేకాటరాయుళ్ల అరెస్ట్



పోలీసులకు పట్టుబడిన పేకాట రాయుళ్లు

చెన్నేకొత్తపల్లి: పేకాట ఆడుతున్న ఆరుగురిని ఆదివారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామ పరిసరాల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.15,200, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

15 నెలల తర్వాత వీడిన మిస్టరీ

- ఆ శవం మోహన్‌కుమార్‌దిగా తేల్చిన పోలీసులు
- ప్రియుడు, కుమారుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య



హతుడు మోహన్‌కుమార్ (ఫైల్)



నిందితులతో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాజ్‌కుమార్, గుడిబండ ఎస్ఐ మునిప్రతాప్, సిబ్బంది

మడకశిర: నియోజకవర్గంలో సంచలనం సృష్టించిన గుర్తు తెలియని శవం కేసు మిస్టరీ ఎట్టకేలకు వీడింది. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్ వివరాలను తెలియజేశారు. 2023 జనవరి 12న మడకశిర మండలం కోడిగానిపల్లి సమీపంలోని హంద్రీనీవా కాలువకు ఏర్పాటు చేసిన బ్రిడ్జి కింద గుర్తు తెలియని శవాన్ని గుర్తించారు. వీఆర్‌ఓ హారతి స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

మిస్సింగ్ కేసుల ఆధారంగా ..

మడకశిర పోలీసులు వివిధ ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్లలో నమోదైన మిస్సింగ్ కేసుల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. అప్పటి మడకశిర సీఐ సురేష్‌బాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆయన బదిలీపై వెళ్లిపోవడంతో ప్రస్తుత మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్, గుడిబండ ఎస్ఐ మునిప్రతాప్ కేసు దర్యాప్తు కొనసాగించారు. ఇందులో భాగంగా కర్ణాటకలోని తుమకూరు జయనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఓ మిస్సింగ్ కేసు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. తుమకూరుకు చెందిన నాగరత్నమ్మ అనే మహిళ తన పెద్ద కుమారుడు మోహన్‌కుమార్ (52) తప్పిపోయినట్లు 2023 జనవరి 21న జయనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వివరాలను మడకశిర పోలీసులు సేకరించారు. ఆ తర్వాత శవం ఫొటోను నాగరత్నమ్మకు చూపించగా మృతుడు తన పెద్ద కుమారుడేనని గుర్తు పట్టింది. మృతుడి సోదరులైన అరుణ్‌కుమార్, కిరణ్‌కుమార్‌లను కూడా మడకశిర పోలీసులు విచారించారు. తప్పిపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు.

విచారణలో పోలీసులకు దొరికిన క్లూ

మృతుడి తల్లి, సోదరుల విచారణలో ఈ కేసుకు సంబంధించిన పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. మృతుడికి, అతని భార్య కవితకు మనస్పర్థలు ఉన్నాయి. దీంతో మృతుడి భార్య ఇంటి నుంచి వెళ్లిపోయి తుమకూరులోనే శిరా గేట్‌లో వేరుగా తన కుమారుడు కౌశిక్, కుమార్తె దీక్షితతో కలిసి ఉంటోందని వారు పోలీసులకు వివరాలు అందించారు. ఈవివరాల మేరకు మడకశిర పోలీసులు మృతుడి భార్య కవితను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేశారు.

భార్య విచారణతో వీడిన మిస్టరీ

మృతుడి భార్య కవితను పోలీసులు విచారణ చేయడంతో మోహన్‌కుమార్‌ను హత్య చేసినట్లు తేలింది. కవితకు తుమకూరు జిల్లా గుబ్బిలో పనిచేసే విద్యుత్‌శాఖ జేఈగా పని చేసే అక్తర్‌పాషాతో ఆరేళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. అతనితో సహజీవనం కూడా చేసేది. అక్తర్‌పాషాతో కవిత డబ్బులు ఇప్పించుకుని తుమకూరులోనే ఓ హోటల్ పెట్టింది. ఈ క్రమంలో మృతుడు మోహన్‌కుమార్ పలుసార్లు హోటల్ వద్దకు వెళ్లి భార్య కవిత, ప్రియుడు అక్తర్‌పాషా, హోటల్‌లో పని చేసే వంట మనిషి మోహన్‌ప్రసాద్, కుమారుడు కౌశిక్‌ను దూషించేవాడు. తన ఆస్తిని మీకు ఇవ్వనని, తన సోదరులకు ఇస్తానని భార్య, కుమారుడితో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో భార్య కవిత, కుమారుడు కౌశిక్, ప్రియుడు అక్తర్‌పాషాలు మోహన్‌కుమార్‌ను చంపడానికి నిర్ణయం తీసుకున్నారు. దీనికి హోటల్ వంట మనిషి మోహన్‌ప్రసాద్‌తో సుపారీ మాట్లాడారు. రూ.లక్షకు ఒప్పందం చేసుకొని రూ.50 వేలు అడ్వాన్స్‌గా ఇచ్చారు.

చికెన్ బిర్యానీలో నిద్రమాత్రలు కలిపి హత్య

పథకం ప్రకారం కుమార్తె దీక్షితకు ఆరోగ్యం బాగా లేదని మోహన్‌కుమార్‌ను భార్య కవిత 2023 జనవరి 11న రాత్రి 9 గంటల సమయంలో ఫోన్ చేసి ఇంటికి పిలిపించింది. చికెన్ బిర్యానీలో నిద్ర మాత్రలు వేసి మోహన్‌కుమార్‌కు పెట్టారు. భోజనం చేసిన తర్వాత మృతుడు మత్తులోకి పోయాడు. ఈక్రమంలో భార్య కవిత, కుమారుడు కౌశిక్, వంట మనిషి మోహన్‌ప్రసాద్.. మోహన్‌కుమార్ తలపై రోకలిబండతో కొట్టారు. మృతుడి భార్య ప్రియుడు అక్తర్‌పాషా కత్తితో గొంతుకోశారు. మోహన్‌కుమార్ మృతి చెందగా శవాన్ని ఓ ప్లాస్టిక్ సంచిలో కట్టి వంట మనిషి ఓ కారులో వేసుకుని మడకశిర మండలంలోని కోడిగానిపల్లి హంద్రీనీవా కాలువ బ్రిడ్జి కింది భాగాన పడేసి వెళ్లారు.

నలుగురు నిందితుల అరెస్ట్

పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్, గుడిబండ ఎస్ఐ మునిప్రతాప్ సిబ్బంది ఆదివారం నిందితులను తుమకూరులో అరెస్ట్ చేశారు. శవాన్ని తరలించడానికి ఉపయోగించిన కారు, మరణాయుధాలు కూడా సీజ్ చేశారు. నిందితులైన కవిత, అక్తర్‌పాషా, కౌశిక్, మోహన్‌ప్రసాద్‌లను కోర్టులో హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐ మునిప్రతాప్ తదితర పోలీసులను ఎస్పీ రత్న అభినందించినట్లు పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.